క్యాన్సర్ క్యాంపెయిన్ || *ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మాసోత్సవాల్లో భాగంగా తెలంగాణ సచివాలయం సహా పలు ప్రధాన ప్రాంతాలకు అదివారం రాత్రి గులాబీ రంగు లైట్లతో అలంకరించారు.*

5 నెలల్లో 99,107 కోట్లు

- అంచనాల్లో ఆగస్టు నాటికి 38% రాబడి
- నిరుటి కంటే 19,099 కోట్లు అధికం
- తాజా నివేదికలో కాగ్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏటికేడు ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నది. సంపదను సృష్టించడం, తద్వారా వచ్చిన ప్రతి పైసాను ప్రజలకు పంచడంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. సీఎం కేసీఆర్ పటిష్ఠ ప్రణాళికలతో రాష్ట్రం అద్భుతంగా ఎదుగుతున్న తీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక మరోసారి కండ్లకు కట్టింది. ఆగస్టు నెలకు సంబంధించి శనివారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలోని తొలి 5 నెలల్లోనే తెలంగాణ రూ.99,106.68 కోట్ల రాబడిని సాధించింది. ఇది ఈ ఏడాది మొత్తం బడ్జెట్ అంచనా (రూ.2,59,861.91 కోట్లు)లో 38.14 శాతానికి సమానం. నిరుడు ఇదే సమయంలో వచ్చిన రాబడి కంటే రూ.19,099.04 కోట్లు అధికం. గతేడాది మొత్తం రూ.2,45,256.61 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, ఆగస్టు వరకు రూ.80,007.64 కోట్ల రాబడి వచ్చింది.

రాబడిలో జీఎస్టీదే అగ్రస్థానం

ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రూపేణా మొత్తంగా రూ.50,942.66 కోట్లు ఖజానాకు చేరవచ్చని బడ్జెట్‌లో అంచనా వేయగా, ఆగస్టు వరకు రూ.18,754.10 కోట్ల రాబడి వచ్చింది. ఇది మొత్తం బడ్జెట్ అంచనాలో 37 శాతానికి సమానం. నిరుడు ఇదే సమయంలో వచ్చిన జీఎస్టీ రాబడి కంటే రూ.2,421.93 కోట్లు అధికం.

ఈసారి తొలి 5 నెలల్లో వచ్చిన రాబడులు (రూ.కోట్లలో)

జీఎస్టీ	18,754.10
స్టాంపులు, రిజిస్ట్రేషన్	5,852.43
అమ్మకం పన్ను	12,386.59
కేంద్ర పన్నుల వాటా	5,064.36
ఎక్సైజ్ సుంకాలు	10,149.17
ఇతర పన్నులు, సుంకాలు	3,234.96
పన్నేతర రాబడి	14,482.39
గ్రాంట్ ఇన్ ఎయిడ్	3,009.26
అప్పులు	26,158.45
ఇతరాలు	15.06
మొత్తం	99,106.68

జీఎస్టీ వసూళ్లు రూ.5,226 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సెప్టెంబర్ నెలలో జీఎస్టీ రూ.5,226 కోట్లు వసూలైంది. గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో పోలిస్తే 30% అధికంగా రాబడి వచ్చింది. ఈ సారి ఆగస్టులో జీఎస్టీ రూ.4,393 కోట్లు వసూలు కాగా, ఆగస్టుతో పోలిస్తే రూ.833 కోట్లు అదనంగా వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే జీఎస్టీ వసూళ్లలో దూకుడు కనిపిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రతినెలా వృద్ధి రేటు నమోదవుతూనే ఉన్నది.

దసరాకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగకు సొంతూళ్లకెళ్లే వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 13 నుంచి 25 వరకు 5,265 ప్రత్యేక బస్సులను నడపనున్నది. ఈ బస్సుల్లో 536 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. 22న సద్దుల బతుకమ్మ, 23న మహార్ణవమి, 24న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరిన్ని ప్రత్యేక బస్సులను నడపనున్నది. గత దసరా కంటే ఈసారి దాదాపు 1,000 (20 శాతం) బస్సులను అదనంగా నడుపుతున్నట్టు సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా గోలీ బాధ్యతలు

ఆమనగల్లు, అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా గోలీ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లోగల ఫుడ్ కమిషన్ కార్యాలయంలో ఆయన చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జిల్లా మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

- నీలగిరి ఐటీ టవర్ నేడు ప్రారంభం

నల్లగొండలో అత్యాధునిక సదుపాయాలతో విశాలమైన ఆఫీసు స్పేస్‌తో ఐటీ టవర్ సిద్ధమైంది. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో 90 కోట్లతో పూర్తిగా గ్రీన్ బిల్డింగ్ తరహాలో దీన్ని నిర్మించారు. తొలి దశలో 17 కంపెనీలు 1,200 మందికి ఉపాధి కల్పించేలా ఇప్పటికే రిక్రూట్‌మెంట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిసింది.

– నల్లగొండ ప్రతినిధి, నమస్తే తెలంగాణ

తెలంగాణలో ఫేక్ వర్సిటీల్లేవ్!

- జాతీయంగా 20 ఫేక్ యూనివర్సిటీలు
- ఢిల్లీలో 8, యూపీ 4, ఏపీ 3, బెంగాల్‌లో 2
- ఈ ఏడాది వివరాలు వెల్లడించిన యూజీసీ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో ఫేక్ యూనివర్సిటీలు లేవని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తాజాగా ప్రకటించింది. రాష్ట్రంలో నిరుడు సైతం ఒక్క నకిలీ యూనివర్సిటీ లేకపోగా, ఈ ఏడాది వాటికి చోటులేదని అధికారికంగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో నకిలీ వర్సిటీల జాబితాను యూజీసీ తాజాగా విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 8 ఫేక్ వర్సిటీలు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 4, పశ్చిమబెంగాల్‌లో 2, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయి. కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరిలో ఒక్కోటి చొప్పున ఉన్న ఫేక్ వర్సిటీల జాబితాను యూజీసీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయా వర్సిటీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శులకు యూజీసీ లేఖలు రాసింది. చెల్లని డిగ్రీలను ప్రదానం చేస్తున్న ఫేక్ విద్యాసంస్థలు, వర్సిటీలకు షోకాజ్ నోటీసులు జారీచేస్తామని యూజీసీ వర్గాలు హెచ్చరించాయి. నకిలీ వర్సిటీల్లో ప్రవేశాలు పొందే సమయంలోనే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది.

ఆదివారం హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్. చిత్రంలో వయోవృద్ధులను ఎన్నికల ఐకాన్ అమల, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు

- వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పిస్తాం
- ఇంటి నంబరు ఆధారంగా పోలింగ్‌స్టేషన్లు కేటాయిస్తాం
- అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలో సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్ సిటిబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా 80 ఏండ్లు పైబడిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పిస్తామని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్ చెప్పారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు భారత ఎన్నికల సంఘం ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఇంటి వద్దనే కల్పిస్తామని, దాంతో ఇంటి వద్దే ఓటు వేసుకోవచ్చని వెల్లడించారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హౌస్‌నంబర్ ఆధారంగా పోలింగ్ స్టేషన్లను కేటాయిస్తామని చెప్పారు. ఓటర్ తుది జాబితాలో తమ పేరు ఉందో లేదో ముందస్తుగా వృద్ధులు తప్పకుండా చెక్ చేసుకోవాలని సూచించారు.

మొదటి గంటలోనే ఓటు వేస్తాం: అమల

మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల ఐకాన్ అమల కోరారు. పోలింగ్ రోజు తమ కుటుంబం మొత్తం మొదటి గంటలోనే వేస్తుందని గుర్తు చేశారు. వయో వృద్ధుల కోసం నగరవ్యాప్తంగా 115 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ చెప్పారు. ఈ సెంటర్ల ద్వారా వయోవృద్ధులు ఓటు నమోదుకు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించడానికి కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రే, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, కంటోన్మెంట్ సీఈవో మధుకర్‌నాయక్, అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కమిషనర్ అబ్దుల్ వకీల్, సీనియర్ సిటిజన్స్ అధికారులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రానికి సీఈసీ

మొదటిపేజీ తరువాయి...

సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీశ్‌కుమార్ వ్యాస్, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు అజయ్ భాడూ, హిర్దేశ్‌కుమార్, ఆర్కే గుప్తా, మనోజ్‌కుమార్ సాహూ తదితరులు ఉన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నద్ధతపై ఎన్నికల నిర్వహణ అధికారులు, సంస్థలతో సమీక్షిస్తారు. జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశమవుతారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న సహకారంపై చర్చించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతోనూ ఈ బృందం ప్రత్యేకంగా సమావేశమవుతుంది. పర్యటన చివరల్లో పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించనుంది.

రేషన్ కేవైసీకి గడువు లేదు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): రేషన్ కార్డు కేవైసీకి ఎలాంటి తుది గడువు విధించలేదని, దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని విని యోగదారులు నమ్మొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. కేవైసీ చేయించుకోని పక్షంలో కార్డులో పేరు తొలగిస్తారనేది పూర్తిగా దుష్ప్రచారమని కొట్టిపారేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రంలో ఈ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. రేషన్ లబ్ధిదారులు కేవైసీ పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయగా, తెలంగాణ పౌర సరఫరాల సంస్థ జనవరి వరకు కేవైసీ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో మాత్రం అసత్య ప్రచారం జరుగుతున్నది. దీనిపై ఇప్పటికే స్పందించిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కేవైసీ ప్రక్రియను ఆపేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రేషన్ కార్డుల్లో పేర్లున్న వారు చాలా మంది ఇతర దేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉన్నారని, కేంద్రం నిబంధనతో వారందరికీ ఇబ్బంది అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పదిరోజుల్లో గ్రూప్-4 ఫైనల్ కీ

- ఆ తర్వాత వెంటనే మెరిట్‌లిస్ట్ ప్రకటనకు టీఎస్‌పీఎస్సీ కసరత్తు

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 ఫలితాలపై టీఎస్‌పీఎస్సీ ముమ్మర కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే ప్రిలిమినరీ కీని విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో వారం, పది రోజుల్లో ఫైనల్ కీని వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఆ తర్వాత వెంటనే మెరిట్ లిస్టును ప్రకటించాలని భావిస్తున్నది. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో గ్రూప్ -4 క్యాటగిరీలో 8,039 ఉద్యోగాల భర్తీకి నిరుడు డిసెంబర్ 1న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు అత్యధికంగా 9,51,205 మంది దరఖాస్తు చేశారు. జూలై 1న పరీక్ష నిర్వహించగా, పేపర్ -1కు 7,63,835 మంది, పేపర్ -2కు 7,61,026 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అత్యధిక ఉద్యోగాలు ఉండటం, ఎక్కువ మంది అభ్యర్థులు పరీక్ష రాయడంతో గ్రూప్-4పై కమిషన్ ప్రత్యేక శ్రద్ధ వహించింది. రోజుకు సగటున 25 నుంచి 30 వేల ఓఎంఆర్ షీట్లను స్కానింగ్ చేసింది. ఆ తర్వాత ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలించి ఆగస్టు 28న ప్రిలిమినరీ కీని విడుదల చేసింది. ప్రిలిమినరీ కీతోపాటు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు, మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అదేనెల 30 నుంచి సెప్టెంబర్ 4వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించింది. వారంలో టీఎస్‌పీఎస్సీ కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, సభ్యుల అభిప్రాయాలు స్వీకరించిన తర్వాత ఫైనల్ కీని విడుదల చేయాలని భావిస్తున్నది. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆలోపే గ్రూప్-4 ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

- కాళేశ్వరం ప్యాకేజీ-27 ట్రయల్ రన్ సక్సెస్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని కాళేశ్వరం ప్యాకేజీ-27 ట్రయల్‌రన్ విజయవంతమైంది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో నిర్మించిన గుండంపల్లి సమీపంలోని పంప్‌హౌస్ వద్ద అదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. దీన్ని ఇరిగేషన్ ఈఈ రామారావు పర్యవేక్షించారు. ఈనెల 4న మంత్రులు కేటీఆర్, అల్లోల దీన్ని ప్రారంభించనుండగా, ట్రయల్ రన్ నిర్వహించారు.

–దిలావర్‌పూర్, అక్టోబర్ 1